



క్రిమిసంహారక మందు చల్లుతున్న డ్రోన్

వ్యవసాయంలో డ్రోన్లు

- కూలీల సమస్యకు చెక్
- ఖర్చు తక్కువ... సమయం ఆదా
- గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

జిల్లాలో వ్యవసాయ రంగం ఆధునిక శాస్త్ర పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ విస్తరిస్తున్నది. జిల్లా రైతులు వానాకాలం, యాసంగి సీజన్లలో ఆరు లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తోంది. వరి, మొక్కజొన్న, పత్తి ప్రధాన పంటలుగా సాగు చేస్తున్న రైతులు ఆధునిక వ్యవసాయం వైపు దృష్టి సారిస్తున్నారు. సాగు విస్తీర్ణం పెరగడం, వ్యవసాయ కూలీలు దొరకక పోవడం, ఇతరత్రా కారణాలతో వ్యవ సాయ యాంత్రీకరణవైపు దృష్టి సారిస్తున్నారు. దున్నడం, నాట్లు వేయడం, కోతలు కోయడానికి, పంట నూర్పిడికి మాత్రమే ఆధునిక యంత్రాలను ఉపయోగిస్తూ వస్తున్న జిల్లా రైతులు ఒకటిరెండు సంవత్సరాలుగా ఎరువులు, క్రిమిసంహారక మందులు చల్లేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నారు.

కూలీల సమస్య లేకుండా పోవడంతో పాటు ఒకే రోజులో పదెకరాల వ్యవసాయ క్షేత్రంలో ఎరువులు, క్రిమిసంహారక మందులు చల్లేందుకు వీలుకలుగడం, శ్రమ, డబ్బు వ్యయం తగ్గడంతో డ్రోన్ల వినియోగంపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. డ్రోన్ల వినియోగం పెరగడంతో జిల్లాలోని పలువురు యువకులు డ్రోన్లను ఉపాధి మార్గాలుగా ఎంచుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రస్తుతం 50కిపైగా డ్రోన్లు రైతులకు సేవలందిస్తున్నాయి.

గంటకు 500 రూపాయలు

క్రిమిసంహారక మందులు పొలంలోగాని, పత్తి చేళ్ళలోగాని స్ప్రే చేయడానికి ఒక్కోకూలికి రోజుకు వెయ్యి రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. అతడికి నీరు, మందులు అందించడానికి సహాయకులుగా ఉండే వారికి మరో 500 రూపాయలు వెచ్చించాల్సి వస్తున్నది. 1500 రూపాయలను ఖర్చుచేస్తే ఒక రోజులోం రెండు ఎకరాల పంట పొలాలకు మాత్రమే క్రిమి సంహారక మందును పిచికారి చేసే అవకాశమున్నది. స్ప్రేయర్ ద్వారా మందు పిచికారి చేయడానికి నీటిని ఎక్కువగా వినియోగించాల్సి వస్తున్నది. దీంతో క్రిమిసంహారక మందు ఎక్కువ వాడాల్సి వచ్చి ఖర్చు పెరిగేది. డ్రోన్ ద్వారా క్రిమిసంహారక మందు పిచికారి చేస్తే డ్రోన్ నిర్వాహకుడికి గంటకు 500 రూపాయలు చెల్లిస్తే సరిపోతున్నది. డ్రోన్‌కు అమర్చి ఉన్న 10 లీటర్ల క్యాన్‌లో నీటిని ఎకరానికి సరిపోయే క్రిమిసంహారక మందును పోస్తే.. ఐదు నిమిషాల్లో పని పూర్తవుతున్నది.

తగ్గిన నీటి వినియోగం

డ్రోన్ ద్వారా 10 ఎకరాల విస్తీర్ణంలో గంట, గంటన్నరలో పురుగుల మందు పిచికారి చేయవచ్చు. డ్రోన్ వినియోగించడంతో సహాయకుడికి వెచ్చించాల్సిన 500 రూపాయలు మిగలడంతోపాటు సుమారు వంద లీటర్ల నీటి వినియోగం కూడా తగ్గుతున్నది. ఒకేరోజు పని పూర్తవడంతో రైతులకు శ్రమ తగ్గుతున్నది. క్రిమిసంహారక మందు వినియోగం స్ప్రేయర్ ద్వారా చల్లడాని కంటే డ్రోన్ ద్వారా స్ప్రే చేస్తే 30 శాతం మందు తక్కువ పడుతుంది. దీంతో రైతులు డ్రోన్ల వినియోగం పట్ల మొగ్గు చూపుతున్నారు.

జిల్లా అవసరాలకు సరిపడా డ్రోన్లు అందు బాటులో ఉండడం లేదు. కొందరు ఔత్సాహిక యువకులు డ్రోన్లను కొని ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఒక్కో డ్రోన్ విలువ 2.8 లక్షల నుంచి నాలుగు లక్షల రూపాయల వరకు ఉంది. డ్రోన్లు, స్మార్ట్ డ్రోన్లను ప్రస్తుతం వినియోగిస్తున్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఊరికి ఒక డ్రోన్ వచ్చినా దానికి సరిపోయే పని దొరికే అవకాశమున్నది. గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్న యువకులు డ్రోన్లు ఖరీదు చేసి ఉపాధి కల్పించుకోవడానికి మంచి మార్గంగా నిలిచే అవకాశమున్నది.

ఖర్చులు కూలీల సమస్య తగ్గింది..

: సతీష్, రైతు, గుమ్లాపూర్



డ్రోన్లు అందుబాటులోకి రావడంతో పొలాలకు మందు చల్లే ఖర్చులు తగ్గాయి. కూలీల సమస్య లేకుండా పోయింది. నాకున్న ఆరెకరాల భూమికి మందు చల్లేందుకు మూడురోజులు పట్టేది. డ్రోన్ రావడంతో అరగంటలో పని పూర్తవుతున్నది. మూడురోజులు మందు కొట్టేందుకు 4,500 రూపాయలు ఖర్చయ్యేది. ఇప్పుడు డ్రోన్‌కు మూడు వేలు మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. క్రిమి సంహారక మందు ఖర్చు 30 శాతం తగ్గింది.

ఎంబీఏ చదివి.. ఉద్యోగం వదిలి.. డ్రోన్లతో ఉపాధి



డ్రోన్ ఆపరేట్ చేస్తున్న హరికృష్ణ

చొప్పదండి మండలం గుమ్లాపూర్ గ్రామానికి చెందిన ఆకుల హరికృష్ణ ఎంబీఏ చదివి రెండు సంవత్సరాలు బ్యాంకులో ఉద్యోగం చేశాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన హరికృష్ణ వ్యవ సాయం పై ఉన్న ఆసక్తితో చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి తండ్రి పరంధాములుకు తోడుగా వ్యవసాయం చేసేందుకు ఇంటికి వచ్చాడు. వ్యవసాయ కూలీలతో సమస్య ఏర్పడడం, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై ఆసక్తి పెరగడంతో హరికృష్ణ దృష్టి డ్రోన్ వినియోగంపై పడింది. సొంత అవసరాల కోసం డ్రోన్‌ను కొన్న హరికృష్ణ తర్వాత దానిని ఉపాధి మార్గంగా ఎం చుకున్నాడు. 15 నెలల క్రితం గం గాధర మండల కేంద్రంలో శ్రీ విఘ్నేశ్వర వ్యవసాయ డ్రోన్స్ అనే పేరుతో ఒక సంస్థను నెలకొల్పి డ్రోన్ల అమ్మకాలు, సర్వీసు ఇవ్వడం ప్రారంభిం చారు. ఇప్పటి వరకు 14 డ్రోన్లను విక్రయిం చాడు.

టవర్‌సర్కిల్, కూరగాయల మార్కెట్‌లో పోలీసుల తనిఖీలు

సామగ్రి సీజ్, ఠాణాకు తరలింపు

ఫుట్‌పాత్ ఆక్రమణలపై కొరడా..

కరీంనగర్ క్రైం, ఆగస్టు 23: కరీంనగర్‌లోని టవర్‌సర్కిల్, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో వ్యాపారులు, చిరు వ్యాపారులు, కూరగాయల వ్యాపారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి సామగ్రిని పెడుతూ పాదచారులు నడిచేందుకు ఇబ్బంది కర పరిస్థితులను కల్పిస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలు స్తంభిస్తున్నాయి. ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మేరకు అనేక వర్గాల నుంచి పోలీసులకు ఫిర్యాదులు కూడా అందుతున్నాయి. ఈ నేపథ్యంలో కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై కొరఢా ఝులిపించారు. టవర్ సర్కిల్, కూరగాయల మార్కెట్ ఏరియాలో ఫుట్‌పాత్‌లపై సామాగ్రిని పెట్టి వ్యాపారం చేస్తున్న వారి సామగ్రిని ట్రాఫిక్ సీఐ కరీముల్లాఖాన్ ఆధ్వర్యంలో పోలీసులు సీజ్ చేసి వాహనాల్లో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. నిబంధనలు అతిక్రమించి ఫుట్‌పసాత్‌లను ఆక్రమించినవారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు కూడా విధిస్తామని హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ సీఐ పర్శ రమేష్, ఎస్‌ఐ ఇషాక్‌అహ్మద్, ఆర్‌ఎస్‌ఐ డి వేణు, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



ఫుట్‌పాత్‌లపై పెట్టిన సామగ్రిని ఠాణాకు తరలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

● ఆక్రమణలతో తీవ్ర ఇబ్బందులు

కరీంనగర్‌లోని టవర్‌సర్కిల్, రాజీవ్‌చౌక్, కూరగాయల మార్కెట్, ప్రకాశంగంజ్ ప్రాంతాలలో నిత్యవసర సరుకులతోపాటు వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, భవననిర్మాణం సామగ్రి, బట్టలషాపులు, హోల్‌సేల్ దుకాణాలు ఉంటాయి. వివిధ వస్తువులు, కూరగాయలు, ఇతర సామగ్రి కొనుగోలుకు నిత్యం వివిధ వర్గాల ప్రజలు వేలసంఖ్యలో వస్తుంటారు. ఈ ప్రాంతమంతా ఇరుకు రోడ్లతో వాహనాలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందికరంగా ఉంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో కొందరు పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్ పాత్‌లను ఆక్రమించి సామగ్రిని పెడుతున్నారు. దుకాణాల ముందు, ఫుట్ పాత్‌ను ఆనుకుని వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలోనూ పోలీస్, మున్సిపల్ శాఖల అధికారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన వ్యాపారుల సామగ్రిని సీజ్ చేశారు. కొన్ని రోజులకు యథావిధిగా దుకాణాలు వెలిశాయి. దీంతో టవర్ సర్కిల్ ప్రాంతంలో తరచుగా వాహనాల రాకపోకలు స్తంభిస్తున్నాయి. ఆక్రమణలు పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి యూత్ బాస్కెట్ బాల్ పోటీలకు జిల్లా జట్లు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 23: రాష్ట్ర స్థాయి యూత్ బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొన నున్న జిల్లా జట్లను శుక్రవారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి అనంతరెడ్డి ప్రకటించారు. అంబేద్కర్ స్టేడియంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన జట్ల శిక్షణ శిబిరంలో ప్రతిభ చాటిన క్రీడాకారులను తుది జట్లకు ఎంపిక చేశామని ఆయన తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఈనెల 25 నుంచి నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయన్నారు. ఎంపికైన క్రీడాకారులను సీనియర్ క్రీడాకారులు, పిడిలు జి శ్రీధర్ రావు, సునీల్ కుమార్, బి సత్యనంద్, అరుణ్ తేజ, జీవన్ కుమార్, వెంకటేష్, పర్మిత్ కౌర్‌లు అభినందించారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

బాలుర విభాగం: వి స్పహిత్, డి రిషి, జి అశ్విన్, ఎస్ సాల్మన్, ఓ వజ్రంగ్, ఏఎస్ హనన్, కె రాఘవేంద్ర, బి సిద్దార్థ్, కె సాయిదేవహర్ష, ఎం శరణ్, కె త్రినేష్, యు శ్రవణ్. స్టాండ్‌బైస్‌గా జి సాయి విగ్నేశ్వర్, ఈ గ్యానిక్ రాజ్ ఎంపికయ్యారు.

బాలికల విభాగం: ఎం అక్షయ, డి కార్తీక, డి సహస్ర, డి ముగ్ధ, భద్ర, బిబిష్, ఎస్ జస్లీన్, జి సంస్కృతి, పి త్రయ, వి బ్లెస్సీ గ్రేసీ, కె సన్నిధి, ఎ హర్షిణి, ఎన్ సువాక్షి. స్టాండ్‌బైస్‌గా ఎస్ అశ్విక, ఆర్‌వి హాసిని ఎంపిక య్యారు.



రాష్ట్ర స్థాయి యూత్ బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

గీత కార్మికులకు రక్షణ కవచం

- జిల్లాకు 400 సేఫ్టీ కిట్స్ మంజూరు
- ఎక్సైజ్, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ



కాటమయ్య రక్షణ కవచంపై శిక్షణ ఇస్తున్న అధికారులు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 23: గీత కార్మికులు తాటి చెట్టు, ఈత చెట్టుపై నుంచి పడి పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. పలువురు అంగవైకల్యం బారిన పడుతున్నారు. దీంతో వారి కుటుంబాలు తీవ్ర దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. ఇటువంటి సందర్భాల్లో గీత కార్మికులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎక్సైజ్‌శాఖ ద్వారా గీత వృత్తిలో ప్రమాదాలకు గురైన కార్మికులకు ఎక్స్‌గ్రేషియాను అందిస్తున్నది. ఈ పథకం కింద లబ్ధిదారుల ఎంపిక, ఆర్థిక సహాయం అందుకోవడానికి జాప్యం జరుగుతున్నది. పంట పొలాల్లో, గ్రామాలకు దూరంగా తాటి, ఈత చెట్లను ఎక్కి కల్లుగీసే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అక్కడ ఎవరూ లేకపోవడంతో గీత కార్మికుల పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోతున్నారు.

గీత కార్మికులకు ఉచితంగా..

ఇటువంటి ప్రమాదాల నుంచి గీతకార్మికులను రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 'కాటమయ్య రక్షణ కవచం' కిట్ల(సేఫ్టీమోకు)ను తీసుకువచ్చింది. ఈ సేఫ్టీమోకును గీతకార్మికులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నది. జిల్లాకు మొదటి విడతగా 400 కాటమయ్య రక్షణ కవచం యూనిట్లు మంజూరయ్యాయి. నియోజకవర్గానికి 100 కిట్లు వంతున మంజూరు కాగా గీతకార్మికల సంఘాలు ఎంపిక చేసిన కార్మికులకు ప్రాధాన్యక్రమంలో కిట్లను అందించేందుకు బీసీ సంక్షేమశాఖ, ఎక్సైజ్ శాఖలు సిద్ధమయ్యాయి. ఈ రెండు శాఖల ఆధ్వర్యంలో కాటమయ్య రక్షణ కవచం వినియోగంపై జిల్లా అంతటా గీతకార్మికులకు శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి వరకు 73 మంది గీతకార్మికులకు శిక్షణ పూర్తి చేశారు. శిక్షణ పూర్తిచేసుకున్న గీత కార్మికులు మిగతా గీతకార్మికులకు గ్రామాల్లో శిక్షణ ఇస్తున్నారు. కాటమయ్య రక్షణ కవచాన్ని ఏ విధంగా ఉపయోగించాలి? ఏ విధంగా రక్షణ ఉంటుంది? అనే అంశాలపై శిక్షకులు గీతకార్మికులకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లోనే ప్రాక్టికల్‌గా ఈత, తాటి చెట్లను ఎక్కేందుకు ఈ కాటమయ్య రక్షణ కవచాన్ని ఉపయోగిస్తూ శిక్షణ ఇస్తుండడంతో తమకు ఉపయోగకరంగా ఉంటుందని గీత కార్మికులు వ్యక్తమవుతున్నది.

కాటమయ్య రక్షణ కవచం గీతకార్మికులందరికి అందజేయాలి

ముత్యం శంకర్‌గౌడ్, సర్దార్ సర్వాయిపాపన్న గీతకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు



గీతకార్మికుల ప్రాణాలు కాపాడేందుకు, ఈత, తాటి చెట్లపై జరిగే ప్రమాదాలను నియం త్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ముత్యం కాటమయ్య రక్షణ కవచం కిట్లు అందరు గీత కార్మికులు అందించాలి. ఈ పథకం తీసుకువచ్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. జిల్లాలో తరచు గా ప్రమాదాల బారిన పడుతున్న గౌడన్నలు ప్రాణాలు కోల్పోతుండటంతో వారి కుటుంబ సభ్యులు బజారున పడుతున్నారు. గీతకార్మికులందరికీ శిక్షణ ఇచ్చి ఆదుకోవాలి.

ఎలా పని చేస్తుంది..

సేఫ్టీ కిట్‌లో గార్డ్, రోప్, హుక్స్ ఉంటాయి. గీత కార్మికుడు చెట్టు ఎక్కేముందు గార్డ్ ధరించాల్సి ఉంటుంది. మోకుతోపాటు రోప్‌ను చెట్టుకు బిగించాలి. చెట్టు ఎక్కేటప్పుడు పొరపాటున మోకు జారినా రోప్ బిగుసుకుని హుక్స్, గార్డ్ సహాయంతో సురక్షితంగా ఉండవచ్చు. ఈ సేఫ్టీ కిట్‌పై అధికారులు గీత కార్మికులకు అవగాహన కల్పిస్తున్నారు. గీత కార్మికులందరికీ కిట్లు అందుబాటులోకి వస్తే ఎన్నో ప్రాణాలను రక్షించవచ్చు.



సేఫ్టీగార్డ్ ధరించిన గీత కార్మికుడు

సమష్టి కృషితోనే డ్రగ్స్, గంజాయి రహిత సమాజం



కరీంనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గంజాయి రహిత సమాజం ఏర్పాటు కోసం అన్ని శాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి నార్కో సమన్వయ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ పరివర్తన్‌లో భాగంగా గంజాయి, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిం చాలని అధికారులకు సూచించారు.

గంజాయిని అక్రమ రవాణా చేసినా, విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. పిల్లలు మాదక ద్రవ్యాలకు అలవాటుపడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని, వీటికి అలవాటు పడితే ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందులు తప్పవని సూచించారు. డ్రగ్స్ వినియోగం దుష్ప్రభావాలపై సోషల్ మీడియాతోపాటు కళాశాలల్లో పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జిల్లాలో డ్రగ్స్ నిర్మూలన కోసం లైన్ డిపార్ట్‌మెంట్స్ ఒకటిగా కలిసి పనిచేయాలని ఆదేశించారు. గతంలో గంజాయి కేసులో పట్టుబడ్డ వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఎఫ్‌వో బాలమణి, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఆర్వో పవన్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, డీడబ్ల్యూవో సరస్వతి, ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్, ఏసీపీ మాధవి, పోలీస్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి



చొప్పదండి మండలం గుమ్లాపూర్‌లో చిన్నారులకు తినిపిస్తున్న కలెక్టర్ సత్పతి

చొప్పదండి: మహిళలు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని గుమ్లాపూర్‌లో నిర్వహించిన శుక్రవారం సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రతి శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో సమావేశం నిర్వహిస్తున్నామని, సభను మహిళలంతా వినియోగించుకోవాలన్నారు. మహిళలకు ఏ సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. గర్భిణులు, మహిళలు ఆరోగ్య సమస్యలతో పాటు ఇతర సమస్యలపై చర్చించే అవకాశం వుంటుందని తెలిపారు. మహిళలు సరైన పోషకాహారం తీసుకోవాలని, రక్తహీనత కోసం వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ తిరుపతి రావు, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీఎంహెచ్‌వో సుజాత, మెడికల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సన, తహసీల్దార్ నవీన్, ఎంపీడీవో వేణుగోపాల్, సీడీపీవో కస్తూరి, ఏసీడీపీవో నర్సింగరాణి, ఎంపీవో రాజగోపాల్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్, ఏపీఎం నర్మద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు మెరుగ్గా నిర్వహించాలి

మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



కరీంనగర్ టౌన్, ఆగస్టు 23: నగరంలో పారిశుధ్య నిర్వహణ పనులను మరింత మెరుగ్గా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ సమావేశమందిరంలో పారిశుధ్య నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కార్మికులు సక్రమంగా విధులు నిర్వహిస్తుండడంతోనే నగరం పరిశుభ్రంగా ఉందని, ఇంకా అక్కడక్కడ మెరుగుపరచాల్సిన అవసరముందని అన్నారు. ఉదయం ఐదు గంటలకే కార్మికులతో పాటు జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్లాలని ఆదేశిం చారు. డివిజన్‌లో ఎలాంటి సమస్యలున్నవనేది ముందుగానే గుర్తించి వాటిని వెంటవెంటనే పరిష్కరించాలని, పెద్ద సమస్యలుంటే పై అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై స్పందించి ఆ సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.

అదనపు కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ ప్రతి రోజు శానిటేషన్ పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. నగరం పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉండడంతోపాటు వారి నుంచి వచ్చే ఫిర్యాదులు తగ్గుతాయన్నారు. తడి, పొడి చెత్తను డోర్ టూ డోర్ 100 శాతం వేరు చేసి తీసుకోవాలని, తడి, పొడిచెత్తను వేర్వేరుగా పంపించాలని సూచించారు. అట్టముక్కలు, ప్లాస్టిక్ డబ్బాలను డీఆర్‌సీసీకి తరలించాలని అన్నారు. చికెన్ వేస్టేజ్ డ్రైనేజీల్లో వేయకుండా చూడాలన్నారు. ట్రేడ్ లైసెన్స్‌లపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ సువార్త, అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

గొల్లపల్లి, ఆగస్టు 23: మండలంలోని గోవిందుపల్లి గ్రామంలో ఈ నెల 21న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలిక (16) పరిస్థితి విషమించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఎస్సై సతీష్ కుమార్ తెలిపిన కథనం మేరకు.. గ్రామానికి చెందిన బాలిక జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. బాలికను తల్లిదండ్రులు కళాశాల వసతి గృహంలో ఉంచి చదివించేందుకు సిద్ధమయ్యారు. హాస్టల్‌లో ఉండేందుకు ఇష్టపడని బాలిక ఇంట్లో నుంచి చదువుకుంటానని తల్లిదండ్రులకు తెలిపింది. అందుకు తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన బాలిక ఈనెల 21న పురుగుల మందు తాగింది. కుటుంబసభ్యులు జగిత్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ప్రతిమ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తర లించగా మూడుల రోజుల అనంతరం పరిస్థితి విషమించి మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య

కథలాపూర్, ఆగస్టు 23: జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం కలికోటలో ఖాతా నుంచి డబ్బులు డ్రా చేసి వృథాగా ఎందుకు ఖర్చు చేశా వంటూ తండ్రి మందలించినందుకు యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం...కలికోటకు చెందిన దరావత్ చరణ్ (16) ఇటీవల ఇంటర్ మొదటి సంవత్సరం చదివి చదువు మానేసి వ్యవసాయ పనులు చేస్తున్నాడు. తండ్రి బాబు నాయక్ ఉపాధి పనులకు వెళ్లిన డబ్బులు ఖాతాలో జమ కాగా వెయ్యి రూపాయలు ఫోన్‌పే నుంచి డ్రా చేసుకుని చరణ్ ఖర్చు చేశాడు. దీంతో డబ్బులు ఎందుకు వృథాగా ఖర్చు చేశావని చరణ్‌ను మందలించడంతో మనస్థాపానికి గురయ్యాడు. క్షణికావేశంతో ఊరి చివరన ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి బాబు నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నవీన్ తెలిపారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 4,376 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. నంది పంప్‌హౌస్ నుంచి మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 419 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.302 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

రెండు పంపుల ద్వారా నీటి విడుదల

రామడుగు, ఆగస్టు 23: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతోంది. శుక్రవారం రెండు పంపుల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎస్ఆర్ఆర్ డ్యామ్‌కు తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 18 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా ఇన్‌ఫ్లో

జగిత్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీలోకి 3,872 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 51.023 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 3,872 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

మిడ్ మానేరుకు..

బోయినపల్లి, ఆగస్టు 23: మిడ్ మానేరు ప్రాజెక్టులోకు ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 6,300 క్యూసెక్కులు, మూలవాగు, మానేరు వాగు ద్వారా 110 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 313.71 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 17.78 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. కాగా శనివారం నుంచి ఎల్ఎండీ పాజెక్టుకు రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు దిగువనున్న మానేరు వాగులో రైతుల మోటర్లు తొలగించుకోవాలని సూచించారు. వాగు పరిసర ప్రాంతాల్లోకి వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు.

ఉపాధి నైపుణ్య శిక్షణ దరఖాస్తులకు నేడు తుది గడువు

గణేశ్‌నగర్, ఆగస్టు 23: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీసీ నిరుద్యోగ యువతకు ఉపాధి నైపుణ్య శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు వెబ్‌సైట్ www.tgbcstudycircle.cgg.gov.inలో ఈ నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. హైదరాబాద్‌లోని కుషాయిగూడలో ఎల్జీ హెప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో 100 మంది అభ్యర్థులకు 90 రోజుల పాటు నాన్ రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకాలం పూర్తయిన తరువాత అకాడమీ వారే ఉద్యోగాలు కల్పిస్తారని తెలిపారు. శిక్షణ కాలంలో ఒక్కో అభ్యర్థికి నెలకు రూ.4000 చొప్పున భృతిని సంస్థ అందిస్తుందన్నారు. పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన 18 నుంచి 25 ఏళ్ల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదో తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉండాలని, వివరాలకు 0878-2268686 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కొడుకును గల్ఫ్ నుంచి రప్పించాలి

- విదేశాంగ పీవోఈ అధికారికి తల్లి వినతి



పీవోఈకి విజ్ఞప్తి చేస్తున్న కుటుంబ సభ్యులు

కోరుట్ల రూరల్, ఆగస్టు 23: ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి అనారోగ్యంతో బాధప డుతున్న తన కొడుకును స్వగామానికి రప్పించే విధంగా చర్యలు తీ సుకోవాలని కోరుతూ ఓ తల్లి హైదరాబాదులోని విదే శాంగ పీవోఈ అధికా రికి వినతిపత్రం అందించింది. గల్ఫ్ మెడికల్ సెంటర్ నిర్లక్ష్యంపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ఫిర్యాదు చేసిం ది. మండలంలోని సంగెం గ్రామానికి చెందిన పోతుగంటి చంద్రశేఖర్ జూన్ 24న హైదరాబాదులోని ఎస్కే మెడికల్ సెంటర్ (గల్ఫ్ దేశం గుర్తించిన వైద్య కేంద్రం)లో వైద్య పరీ క్ష చేయించుకుని జూలై 11న ఉద్యోగ విసాపై సౌదీ అరేబియాలోని అల్ - బాద్ తాబూక్‌కు వెళ్లి ఓ కంపనీలో సూపర్ వైజర్‌గా చేరినట్లు తల్లి లక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది. వెళ్లే ముందు చంద్రశేఖర్‌కు ఫిట్‌నెస్ కోసం ఇచ్చిన టీకా వికటించిందని తన కుమారుడి చేతికి తీవ్ర గాయం అయి ఆరోగ్యం క్షీణి స్తోందని కంపెనీ యజమానుల దృష్టికి తీసుకెళ్లినా స్పందిం చడం లేదని వాపోయింది. హైదరాబాదులోని మెడికల్ సెంటర్ నిర్లక్షంగా వ్యవహరించడం వల్లనే తన కొడుకు దేశం కాని దేశంలో ఇబ్బందులు పడుతున్నాడని తెలిపింది. గల్ఫ్ జేఏసీ కన్వీనర్ రవి గౌడ్ సహకారంతో చంద్రశేఖర్ సహకారంతో అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. తన కుమారుడు స్వ గామానికి చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరింది.

హత్యకు దారి తీసిన వివాదం

- కొలనూరు హత్య కేసులో నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ గజ్జి కృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ కృష్ణ

సుల్తానాబాద్, ఆగస్టు 23: చిన్న మాటతో పెరిగిన వివాదం చివరకు హత్యకు దారి తీసిందని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ అన్నారు. మాజీ హోంగార్డు మాటూరి విజయ్‌ను హత్య చేసిన గోదారిఖనికి చెందిన రౌడీషీటర్ పులిపాక శ్రీకాంత్ అలియాస్ పల్లె శ్రీకాంత్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్టు తెలిపారు. సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ కొలనూరు హత్య కేసు ఉదంతాన్ని వివరించారు. విజయ్, శ్రీకాంత్ కుటుంబాల మధ్య ఇతర భూవివాదాలున్నాయి. ఈనెల 21న రాత్రి పది గంటలకు ఓ మద్యం దుకాణం వద్ద మాటూరి విజయ్, పులిపాక శ్రీకాంత్‌ల మధ్య ఘర్షణ జరిగింది. కేవలం మూత్రశాలలు సరిగా లేవన్నందుకే మాటూరి విజయ్, పులిపాక శ్రీకాంత్ మధ్య మాటామాటా పెరిగి, ఇద్దరు కొట్టుకున్నారు. విజయ్‌ను తోసివేయడంతో పక్కనే ఉన్న ఓపెన్ డ్రైనేజీలో పడి తలకు తీవ్ర గాయమైంది. అయినా మళ్లీ లేపి తన వద్ద ఉంచుకున్న కత్తి తీసి విజయ్‌ను పొడిచి శ్రీకాంత్ పారిపో యాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న విజయ్‌ను ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లలో ఉండగానే ప్రాణాలు కోల్పోయాడు. హంతకుడు పులిపాక శ్రీకాంత్‌పై గోదావరిఖని పోలీస్ స్టేషన్‌లో హత్య కేసుతోపాటు పలు కేసులు నమోదై ఉన్నాయని, గోదావరిఖనిలో రౌడీషీటర్ మంథని సుమన్‌తో తిరిగి వారితో కలిసి హత్యకు పాల్పడ్డాడని, హత్య కేసులో జైలుకు కూడా వెళ్లివచ్చాడని ఏసీపీ తెలిపారు. పలు నేరాలు, కేసుల నమోదు నేపథ్యంలో 14 జూలై 2020న గోదావ రిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శ్రీకాంత్‌పై రౌడీషీట్ ఓపెన్ చేశారని ఏసీపీ వివరిం చారు. హత్య కేసులో ఉన్న శ్రీకాంత్ అప్పటినుంచి తనను కూడా ఎవ రైనా ఏమైనా చేస్తారని ముం దుజాగ్రత్తగా తన వద్ద కత్తి ఉంచుకుని తిరిగేవాడని, అదే భయంతో కొంతకాలంగా తన అమ్మమ్మ ఊరైన కొలనూర్‌లో ఉంటున్నాడని, ఈ నేపథ్యంలో చిన్న మాట పట్టింపుతో మాటూరి విజయ్‌ను హత్య చేశాడన్నారు. అప్పటినుంచి ఎవరికీ దొరకకుండా గోదావరిఖని, పెద్దపల్లి రైల్వే స్టేషన్లు, తదితర ప్రాంతాల్లో తలదాచుకుంటున్నాడని, ఇక ఇక్కడ ఉంటే పోలీసులకు దొరుకుతానన్న భయంతో శుక్రవారం కొలనూర్‌లోని తన ఇంటికి వచ్చి డబ్బులు తీసుకుని హైదరాబాద్ వెళదామనే ప్రయత్నంలో ఉన్న పులిపాక శ్రీకాంత్ గురించి తమకు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్సై సిబ్బంది ఉదయం శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. అతని వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తిని, రక్తం మరకలు అంటిన దుస్తులను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు సుల్తానాబాద్ కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

● సక్రమంగా విధులకు హాజరుకమ్మనందుకు..

విధులకు సక్రమంగా హాజరుకాని ఏఎన్‌ఎంను సక్రమంగా విధులకు హాజరుకావాలని అన్నందుకు ప్రభుత్వ డాక్టర్ హత్యకు పథకం వేశారని పెద్దపల్లి ఏసీపీ కృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 30న కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్న మహేందర్ విధులు ముగించుకుని కారులో పెద్దపల్లికి వెళుతుండగా మార్గమధ్యలో ఏడుగురు గుర్తు తెలియని వ్యక్తులు రాడ్‌లు, కర్రలతో దాడి చేయగా డాక్టర్‌కు తీవ్ర గాయలయ్యాయి. బాధితుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారించగా పందిళ్ల గ్రామంలో ఏఎన్‌ఎంగా పని చేస్తున్న కాసిపాక విజయ కారణమని తేలింది. ఏఎన్‌ఎం విధులకు సక్రమంగా రాకపోగా తనకు పరిచయం ఉన్న ఎన్నం కృష్ణతో తిరిగేది. ఈ నేపథ్యంలో డాక్టర్ మహేందర్ మెమో జారీ చేస్తానని చెప్పడంతో విజయ తనకు సన్నిహితుడైన కృష్ణకు చెప్పింది. అన్నం కృష్ణ, విజయ, మరికొందరు కలిసి డాక్టర్‌ను హత్య చేయడానికి పూనుకున్నారు. బాధితుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎన్‌ఎం విజయతో పాటు అన్నం కృష్ణ, షేర్ల బాలాజీ, కొరడ్ల రఘువర్ధన్‌రెడ్డి, మమిడాల లావణ్‌కుమార్, హిమాయత్, దారంగుల సాగర్, బొక్కల ఆదిత్యలపై కేసు నమోదు చేసి, ఆరుగురిని అరెస్టు చేశామన్నారు. కీలక నిందితులు విజయతోపాటు అన్నం కృష్ణ పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్నారని, ఈ నేపథ్యంలో తాము గంగారం చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండా పట్టుబడ్డారని చెప్పారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసినట్లు శుక్రవారం సుల్తానాబాద్ కోర్టులో హాజరుపరచనున్నామని తెలిపారు. విలేకరుల సమావేశంలో సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, సుల్తానాబాద్, పొత్కపల్లి, కాల్వశ్రీరాంపూర్ ఎస్‌ఐలు శ్రావణ్ కుమార్, ఓంకార్ యాదవ్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో ఏసీబీ అధికారుల తనిఖీలు

» అవినీతి అక్రమాలపై ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ » పలు విభాగాల్లో ఫైళ్లను సీజ్ చేసి తీసుకెళ్లిన అధికారులు



రాజన్న ఆలయంలో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 23: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. గురువారం ఉదయం రాజన్న ఆలయానికి చేరుకున్న ఏసీబీ, మెట్రాలజీ ఫుడ్ సేఫ్టీ అధికారులు ఒకే సారి పలు విభాగాల్లో సోదాలను రాత్రి 8 గంటల వరకు చేపట్టారు. శుక్రవారం ఉదయం సైతం సోదాలు కొనసాగించారు. రాజన్న ఆలయ ప్రధాన విభాగాల్లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని అందిన ఫిర్యాదుల మేరకు ఏసీబీ అధికారులు పలు శాఖల అధికారులతో సోదాలు చేశారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో పలు విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆలయంలోని అన్నదాన సత్రం, లడ్డుల తయారీ విభాగం, గోదాం, సానిటేషన్ విభాగం, ఆడిట్ తదితర విభాగాల్లో సోదాలు నిర్వహించి ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. ఆడిట్, తూనికలు కొలతలు శాఖల అధికారులతో కలిసి సమగ్ర విచారణ చేపట్టారు. ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు చేపట్టడంతో రాజన్న ఆలయ ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. ఏసీబీ అధికారుల విచారణ ఎంత మంది అధికారుల మెడకు చుట్టుకుంటోందోనని ఆలయ ఉద్యోగుల్లో జోరుగా చర్చజరుగుతుంది. సమగ్ర విచారణ చేపట్టి నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. రాజన్న ఆలయంలోని పలు విభాగాల్లో అక్రమాలు, అవినీతి జరుగుతున్నట్లు తమకు వచ్చిన ఫిర్యాదుతో తనిఖీలు చేశామని అన్నారు. పలు విభాగాల్లో సమగ్రంగా విచారణ చేపడుతున్నామని, విచారణ పూర్తి అయిన వెంటనే నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి అందిస్తామని అన్నారు. ఆయన వెంట ఏసీబీ సీఐలు తిరుపతి, కృష్ణకుమార్ ఆడిట్, తూకలు, కొలతల అధికారులు ఉన్నారు.

పోలీసుల పేరుతో చోరీ

- తులంన్నర బంగారు ఆభరణాలు అపహరణ



సీసీ పుటేజీలో పోలీసులు సేకరించిన చిత్రం

కోరుట్ల, ఆగస్టు 23: తాము పోలీసులం అంటూ కోరుట్ల పట్టణంలో శుక్రవారం ఓ వ్యక్తి వద్ద నుంచి తులంన్నర బంగారు ఆభరణాలను ముగ్గురు వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణానికి చెందిన మిట్టపల్లి భూమరాజం శుక్రవారం ఉదయం కూరగాయలు కొనేందుకు తన ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఇందిరా రోడ్డు నుంచి వెళుతున్న భూమరాజంను గుర్తు తెలియని వ్యక్తి వెనుక నుంచి వచ్చి అతడి ద్విచక్ర వాహనానికి అడ్డంగా పెట్టాడు. ఆ వెంటనే మరో వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు తాము పోలీసులమంటూ భూమరాజంతో మాట కలిపారు. గంజాయి తరలిస్తున్నావా అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. వెంటనే అక్కడున్న మరో వ్యక్తి భయపడినట్లు నటించి తన మెడలో ఉన్న బంగారు చైన్‌ను సదరు వ్యక్తులకు అప్పజెప్పాడు. దీంతో సదరు వ్యక్తులు భూమరాజంను కూడా తన మెడలో ఉన్న బంగారం ఇవ్వు అంటూ బెదిరించారు. ఇంతలోనే సదరు వ్యక్తులు భూమరాజం చేతిపై స్ప్రే చేసి మెడలో ఉన్న చైన్‌తో పాటు చేతికి ఉన్న ఉంగరాన్ని తీసుకుని ఆ ముగ్గురూ కలిపి అక్కడి నుంచి పారిపోయారు. కాసేపటికి తెరుకున్న బాధితుడు బంగారు చోరీకి గురైనట్లు గుర్తించి విషయం వెంటనే పోలీసులకు తెలిపారు. ఎస్‌ఐ శ్రీకాంత్, 2వ ఎస్‌ఐ శ్వేత తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితులు ఇచ్చిన సమాచారంతో తనిఖీ నిర్వహించారు. సమీప ప్రాంతాల్లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించి అనుమానితుల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. భూమరాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నిధుల దుర్వినియోగం కేసులో ఇద్దరి రిమాండ్

తిమ్మాపూర్, ఆగస్టు 23: మండలంలోని ఎల్‌ఎండీ స్కూల్ కాంప్లెక్స్ నిధుల దుర్వినియోగంపై ఎల్‌ఎండీ పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్‌ఎండీ కాలనీలోని జిల్లా పరిషత్ పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో విధుల నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుల జీతాలు సుమారు 10లక్షల రూపాయలు దుర్వినియోగం అయినట్లు దీనికి అదే పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న జి తిరుమలతో పాటు ఆమె భర్త కెరాజ్‌కుమార్‌ను బాధ్యులని ఈ ఏడాది ఏప్రిల్ 5న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజభాను చంద్రప్రకాశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో తన సంతాకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు చాలాన్లు సృష్టించి ట్రెజరీలో సమర్పించారని వివరించారు. అకౌంట్ నంబర్లు మార్చడం, ఉపాధ్యాయుల వేతనాల నుంచి అధిక చెల్లింపుల రికవరీ పేరిట తనకు తెలియకుండా డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న ఎల్‌ఎండీ పోలీసులు 420కేసుతో పాటు పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. ఈ మేరకు శుక్రవారం జి తిరుమలతో పాటు రాజ్ కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చేరాలు తెలిపారు.

రూ.4.92లక్షల మాయం.. కేసు నమోదు

మానకొండూర్, ఆగస్టు 23: మానకొండూర్ మండలంలోని ఊటూర్ గ్రామానికి చెందిన నెమ్మది ప్రశాంత్ అనే వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా శుక్రవారం లింకు వచ్చింది. దీంతో ప్రశాంత్ ఆ లింకును ఓపెన్ చేయడంతో అతని బ్యాంకు ఖాతా నుంచి నాలుగు లక్షల 92వేలు మాయం అయ్యాయి. కాగా బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలలని సీఐ సూచించారు.

ఫర్టిలైజర్ షాపులో చోరీ

మంథని, ఆగస్టు 23: స్థానిక అంబేద్కర్ చౌక్ సమీపంలో మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న చకిలం కృష్ణమూర్తి అండ్ సన్స్ ఫర్టిలైజర్ షాపులో గురువారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగింది. షాపు ఓనర్ చకిలం శ్రీనివాస్ రోజువారీగా రాత్రి షాపునకు తాళం వేసుకొని ఇంటి వెళ్లారు. శుక్రవారం ఉదయం షాపు తెరిచిచూడగా తన షాపులో చోరీ గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. షాపు వెనుక భాగంలో ఉన్న కిటికీ స్క్రూలను దొంగ తొలగించి షాపులోకి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.2వేల నగదు, సీసీ కెమెరాల మానిటర్‌ను ఎత్తుకొని వెళ్లాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఈ మేరకు బాధితుడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఆగస్టు 23: విద్యుత్ చౌర్యం చేస్తూ ట్రాన్స్‌కో విజిలెన్స్ పోలీసులకు పట్టుబడిన కేసులో హుజురాబాద్ మండలం సిర్సపల్లి గ్రామానికి చెందిన దొంత మైసయ్యకు 2,817 రూపాయల జరిమానా లేదా ఒక నెల సాధారణ జైలు శిక్ష విధిస్తూ కరీంనగర్ జిల్లా ఒకటవ అదనపు సెషన్స్ జడ్జి డి వెంకటేష్ తీర్పు వెలువరించారని కరీంనగర్ ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ ఎండీ షాదుల్లా బాబా తెలిపారు. నిందితుడిపై 2019 సంవత్సరం జనవరి 31న, అదే సంవత్సరం ఆగస్టు 20న విద్యుత్ చౌర్యం కేసులు నమోదయ్యాయని తెలిపారు.

అంబులెన్స్ బోల్తా.. ఒకరికి తీవ్ర గాయాలు



బోల్తాపడిన అంబులెన్స్

తంగళ్లపల్లి, ఆగస్టు 23: మండలంలోని బద్దెనపల్లి శివారులో ప్రమాదవశాత్తు అంబులెన్స్ బోల్తా పడటంతో ఒకరు తీవ్రంగా గాయపడగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వేములవాడ పట్టణానికి చెందిన శేఖర్ కుడి కాలు విరగడంతో హైదరాబాదులో వైద్య చికిత్స పొంది అంబులెన్స్‌లో కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో అంబులెన్స్ బద్దెనపల్లి శివారులో ప్రమాదానికి గురై బోల్తా పడింది. దీంతో శేఖర్ ఎడమ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. అంబులెన్స్ డ్రైవర్ శివ స్వల్పంగా గాయపడ్డాడు. కాలు విరిగి చికిత్స చేయించుకొని మరో 15 నిమిషాల్లో శేఖర్ ఇంటికి చేరుకుంటాడు అనుకుంటున్న క్రమంలో దురదృష్టం వెంటాడి ప్రమాదంలో మరో కాలు విరిగి తీవ్రంగా గాయపడడం పలువురిని కలిచి వేసింది.

ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, ఆగస్టు 23: శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వంకాయగూడెం గ్రామానికి చెందిన చల్ల కనకయ్య శుక్రవారం రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. కనుకయ్య తలకు బలమైన గాయమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పెట్రోలింగ్ పో లీసులు 108కు సమాచారం కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న ముగ్గురిపై కేసు

జమ్మికుంట రూరల్, ఆగస్టు 23: జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ గ్రామానికి ఎర్ర శ్రావ్యను భర్త అశోక్‌తో పాటు అత్తా, మామ కొంత కాలంగా అదనపు కట్నం తీసుకురావలని వేధిస్తున్నారని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్తతో పాటు అత్త రాజేశ్వరి, మామ సారయ్య నాలుగు లక్షల రూపాయల అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదు చేయగా ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్ స్పెక్టర్ రవి తెలిపారు.

మూడు వేర్వేరు కేసుల్లో ఐదుగురికి జైలు శిక్ష

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 23: మూడు కేసుల్లో ఐదుగురికి జైలు శిక్ష విధించారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మెమోరీ కార్డులో నీలిచిత్రాలు నింపి అమ్మిన సెల్ పాయింట్ యజమాని ఆడెపు రాజుకు రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానాను సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ఎ ప్రవీణ్ విధించారని అయన తెలిపారు. సెల్ పాయింట్ యజమాని సిరిసిల్ల పట్టణం సుందరయ్య నగర్‌కు చెందిన ఆడెపు రాజు అనే వ్యక్తి మొబైల్ ఫోన్‌లో రీచార్జితో పాటు, అధిక లాభాలు ఆర్జించాలనే దురుద్దేశంతో తన యొక్క కంప్యుటర్‌లో నీలి చిత్రాల వీడియోలు డౌన్లోడ్ చేసి తన వద్దకు వచ్చే కస్టమర్లకు మొబైల్ ఫోన్ మెమోరీ కార్డుల్లో నింపి డబ్బులు సంపాదించాడన్నారు.హత్యాయత్నం కేసులో రుద్రంగి గ్రామానికి చెందిన రాగుల బాలకిషన్, రాగులు దేవయ్య , రాగుల రఘు అనే ముగ్గరికి ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.100 జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు. మరో హత్యాయత్నం కేసులో రుద్రంగి గ్రామానికి చెందిన రాగుల వెంకటేష్, రాగుల కొండయ్య , రాగుల నరసయ్య, మర్రి తిరుపతి అనే నలుగురిపై నేరం రుజువు కావడంతో ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష, ఒక్కొక్కరికి 1000 రూపాయల జరిమానా విధిస్తు న్యాయమూర్తి రాధిక జైస్వాల్ తీర్పు చెప్పారన్నారు. మూడు కేసుల్లో నిందితులకు శిక్ష పడటంలో కృషి చేసిన పీపీలు గడ్డం లక్ష్మణ్, టి పవన్, చెలుముల సందీప్, ఎస్‌ఐ రవీంద్రనాయుడు, కోర్ట్ కానిస్టేబుల్‌లు నరేష్, శ్రీనివాస్, కానిస్టేబుల్స్ మధుసూదన్, సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, రుద్రంగి ఎస్‌ఐ అశోక్‌కుమార్‌ను ఎస్పీ అభినందించారు.

బస్‌స్టేషన్‌లో ల్యాప్‌టాప్ మరిచిపోయిన ప్రయాణికుడు



ల్యాప్‌టాప్‌ను డిపో అధికారులకు అప్పగిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

కరీంనగర్ క్రైం, ఆగస్టు 23: కరీంనగర్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో గుర్తుతెలియని ఒక ప్రయాణికుడు తన ల్యాప్‌టాప్‌ను మరిచిపోయాడు. బస్‌స్టేషన్‌లోని హోటల్‌లో మరిచిపోయిన ల్యాప్‌టాప్‌ను గుర్తించిన ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది వెంటనే ఆ ల్యాప్ టాప్‌ను ఆర్టీసీ డిపో-1 క్లర్క్‌కు అందించారు. హెచ్‌పీ కంపెనీకి చెందిన ల్యాప్‌టాప్ ఖరీదు లక్ష రూపాయల వరకు ఉంటుందని అంచనా. కార్యక్రమంలో ఆర్టీసీ సెక్యూరిటీ ఎస్‌ఐ ఎం లక్ష్పతి, కానిస్టేబుల్ రమణ, నారాయణ పాల్గొన్నారు.

అధికారుల తనిఖీలు

చొప్పదండి, ఆగస్టు 23: సాంఘిక సంక్షేమ పాఠశాలల తనిఖీలో భాగంగా శుక్రవారం చొప్పదండిలోని జిల్లాపరిషత్ ప్రాథమిక పాఠశాల, రాంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సన్నబియ్యం నాణ్యత, ఆహారాన్ని జిల్లా పౌర సరఫరాల మేనేజర్ ఎం రజనీకాంత్ తనిఖీ చేశారు. పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ సిబ్బంది మజారుద్దీన్, సాయికుమార్ ,ప్రధానోపాధ్యాయులు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ

- ఆలయాల్లో అమ్మవారలకు కుంకుమ పూజలు



ధర్మపురి మహాలక్ష్మి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు



మహాలక్ష్మి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, ఆగస్టు 23: శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో మూడవ శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. దూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. మహిళలు కుంకుమ పూజలు, ఉద్యాపన పూజలు జరిపారు. అనేక మంది భక్తులు అమ్మవారలను దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు కొరిడె బాలక్రిష్ణ, మధ్వాచారి రాంకిషన్ అందంగా అలంకరణ చేసిన అమ్మవారలకు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల యాగశాల వద్ద ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసా చార్యులు ఆధ్వర్యంలో అర్చకులు మోహనాచార్యా లక్ష్మీ హవనం నిర్వహించారు.

పాకాలవాణికుంటకు బుంగ

-తాత్కాలిక మరమ్మతులు చేసిన అధికారులు

ఇల్లంతకుంట, ఆగస్టు 23: మండలంలోని రేపాక గ్రామంలోని పాకాలవాణికుంటకు శుక్రవారం బుంగపడింది. ఇటీవల కురిసిన వర్షాలతో పాకాలవానికుంట నిండింది. మత్తడి సమీపంలోని కట్టకు బంగపడటంతో నీరు వృధాగా వెళ్లిపోవడాన్ని చూసిన మాజీ ఎంపీటీసీ కాత సుమలతమల్లేశం సమస్యను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు డీఈ శ్రీనివాస్, ఏఈ రాధిక కుంటవద్దకు చేరుకొని ఎక్స్‌కవేటర్ సహాయంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.



పాకాలవాణికుంట నుంచి వెళుతున్న నీరు

ముంపు గ్రామాల రైతులు ఆందోళన చెందొద్దు



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో మహేశ్వర్

గంగాధర, ఆగస్టు 23: ముంపు గ్రామాల రైతులు ఆందోళన చెందొద్దని ఆర్డీవో మహేశ్వర్ అన్నారు. గంగాధర మండలం గర్షకుర్తిలో శుక్రవారం ముంపు గ్రామాల రైతులతో ఆర్డీవో గ్రామసభను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం లింకు ప్రాజెక్టు ఎత్తిపోతల్లో 1.1 టీఎంసీ కాలువ నుంచి డి4 కాలువ కింద గర్షకుర్తి, ఉప్పరమల్యాల గ్రామాల రైతులకు చెందిన 17 ఎకరాలు పోతుందన్నారు. వ్యవసాయ భూమితో పాటు చెట్లు, బావులు, ఇతర వ్యవసాయ పైపులైన్లు తప్పి పోయిన రైతులు నేరుగా ఫిర్యాదు చేయాలన్నారు. తప్పిపోయిన భూములు, బావులు, చెట్లు తదితరాలకు ప్రభుత్వ పరంగా పరిహారం అందిస్తామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమానికి రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనుపమ, డీఈ విష్ణు ప్రసాద్, గర్షకుర్తి, ఉప్పరమల్యాల రెవెన్యూ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ రాజన్నకు ఉడకని నైవేద్యం

- తప్పతాగి విధులకు హాజరైన వంట మనిషి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 23: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారికి ఉడకని నైవేద్యాన్ని శుక్రవారం సమర్పించారు. స్వామి వారికి నిత్యం ఉదయం 11.30 గంటలకు జరగాల్సిన నివేదన అరగంట ఆలస్యమైంది. స్వామి వారి నివేదన సమయంలో నైవేద్యం ఏర్పాటు చేసే వ్యక్తి తప్పతాగి విధులకు హాజరుకావడంతో ఆలస్యమైనట్లు తెలుస్తోంది. ఆగమేఘాల మీద సదరు వ్యక్తి వంటకాలు చేయడంతో మాడిపోయాయి. దీంతో చేసేదేమీ లేక ఉడికీ ఉడకని నైవేద్యాన్ని స్వామి వారికి సమర్పించడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, ఆగస్టు23: ఎస్‌బీఐ ఆర్‌సెటీలో ఆగస్టు 30వ తేదీ నుంచి పురుషులకు రిఫ్రిజరేషన్ అండ్ ఏయిర్‌కండిషనర్‌లో 30రోజుల పాటు ఉచిత శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ డి సంపత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాల వారు 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 9849411002, 798115 1653 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల రాజకీయ డ్రామాలు

● కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా చైర్మన్ పులి ఆంజనేయులుగౌడ్

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 23: రుణమాఫీతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల అటు రైతులకు, ఇటు ప్రజలకు పెరుగుతున్న అభిమానాన్ని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు రాజకీయ డ్రామాలు ఆడుతున్నారన్నారని కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా చైర్మన్ పులి ఆంజనేయులుగౌడ్ అన్నారు. డీసీసీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ పార్టీ హయాంలో ధర్నా చౌక్‌ను ఎత్తివేసిన చోట ఏ ముఖం పెట్టుకొని బీఆర్ఎస్ నాయకులు ధర్నా చౌక్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారని ప్రశ్నించారు. బూటకపు మాటలతో గద్దెనెక్కి 9 ఏళ్ల పాటు తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలించిన బీఆర్ఎస్ పార్టీ చేయలేని పనిని కేవలం 8 నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసినందుకు బీఆర్ఎస్ నాయకులు ధర్నాలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. రోడ్డుపై పడుకొని ధర్నా నిర్వహించిన చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తన పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పూల పాన్పుపై పడుకున్నాడని, అప్పుడు రైతులు గుర్తుకు రాలేదా అని అన్నారు. సమావేశంలో సీనియర్ టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నరాజ మల్లయ్య, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నూనె గోపాల్‌రెడ్డి తదితరులు ఉపాల్గొన్నారు.

28న వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం

భగత్‌నగర్, ఆగస్టు 23: కొత్తపల్లి మండల వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుల మండల కార్యదర్శి గిన్నె లక్ష్మణ్ ఒక ప్రటనలో తెలిపారు. ఈ నెల 28న కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఎంఈఓ ఎ వేణుకుమార్ అధ్యక్షతన జరిగే సమావేశంలో 2024-25 సంవత్సరానికి పాఠశాలల క్రీడల నిర్వహణ తేదీలను ఖరారు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు.

26న సుందర సత్సంగ్ ఆధ్వర్యంలో జన్మాష్టమి

సుభాష్‌నగర్, ఆగస్టు 23: శ్రీ సుందర సత్సంగ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 26న శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహిసున్నామని ట్రస్ట్ అధ్యక్షుడు బొడ్ల కృష్ణ తెలిపారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేడుకల వివరాలను తెలియచేశారు. ఉదయం 8.30 రాత్రి వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రి 9.30 గంటల నుంచి భజనలు, నృత్య ప్రదర్శనలు, ఉయ్యాల సేవ, ఉట్టి కొట్టుట వంటి కార్యక్రమాలతో వేడుకలు ముగుస్తాయని తెలిపారు. సమావేశంలో ట్రస్టు కార్యదర్శి ఈ సురేందర్‌రావు, కోశాధికారి ఆర్ వసంతం, ఉపాధ్యక్షుడు ఎం సుగుణాకర్ పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరించండి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 23: స్థానిక తొమ్మిదవ డివిజన్ పరిధిలో మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డుతో డివిజన్ ప్రజలే కాకుండా రాజీవ్ రహదారి నుంచి వెళ్లే వాహనదారులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారని ఆ డివిజన్ కార్పొరేటర్ జంగిలి ఐలేందర్‌యాదవ్ అన్నారు. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ శుక్రవారం ఐలేందర్ యాదవ్ నగరపాలక సంస్థ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. చెత్తను తొలగించేందుకు స్మార్ట్‌సిటీలో బయోమైనింగ్ ప్రక్రియను ప్రారంభించారని, ఆ చెత్త గుట్ట పూర్తికావడం లేదని, ప్రత్యామ్నాయ స్థలం కేటాయించి చెత్తను అక్కడి నుంచి తరలించాలని కార్పొరేటర్ ఐలేందర్‌యాదవ్ కోరారు.

వికలాంగుల పాఠశాలలో కోల అన్నారెడ్డి జన్మదిన వేడుకలు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 23: నగరంలోని మనోవికాస్ మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలలో అసోసియేషన్ ఆఫ్ అలయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 137ఏ ఆధ్వర్యంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులకు స్వీట్లు, పండ్లతోపాటు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇకపై అలయన్స్‌క్లబ్‌లోని జిల్లా కార్యవర్గసభ్యులంతా తమతమ పుట్టిన రోజు, వివాహ దినోత్సవాలు ఇదే పాఠశాలలో జరుపుకోవాలని తీర్మానించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలలో విద్యార్థుల భోజన ఏర్పాటుకు ఇంజనీర్ కోల అన్నారెడ్డి రూ.12,000, ఎలగందుల శ్రీనివాస్ రూ.7,500 విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ ఈద కుమారస్వామి, గాలిపల్లి నాగేశ్వర్, చెరిమల వెంకటేశ్వర్లు, చీకోటి శ్రీనివాస్, గాంధి, పులాల శ్యామ్, ఎస్ఎల్ఎస్‌వీఎం ప్రసాద్, పండుగ నాగరాజు తదితరులున్నారు.

పోకిరీల వేధింపులపై ఫిర్యాదు చేయాలి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 23 : మహిళలు, విద్యార్థినిలు, యువతులు పోకిరీల వేధింపులను భరించవద్దని, ధైర్యంగా షీటీం పోలీసులకు ఫిర్యాదు చేయాలని మహిళా ఠాణా సీఐ, షీటీం ఇంచార్జి పి శ్రీలత పిలుపునిచ్చారు. కొత్తపల్లి మండలం రేకుర్తిలోని న్యూవిజన్ హైస్కూల్‌లో శుక్రవారం షీటీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పి శ్రీలత మాట్లాడుతూ ఎవరైన పోకిరీలో వేధింపులకు గురిచేస్తే డయల్ 100కు, షీటీం పోలీసులకు ఫోన్ ద్వారా, వాట్సప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సామాజిక మాధ్యమాలలో అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. పోలీసుశాఖ రూపొందించిన టీసేఫ్ యాప్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు.

అల్ఫోర్స్‌లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



వేడుకలను ప్రారంభిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి

హుజూరాబాద్, ఆగస్టు 23: పట్టణంలోని అల్ఫోర్స్ జీనియస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు బాల కృష్ణుడు, గోపిక వేషధారణతో అలరించారు. విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు మన సంస్కృతి సంప్రదాయాలు, పండుగ విశిష్టతల గురించి తెలియచెప్పాల్సిన అవసరం ఉందని తెలిపారు.

మహిళా జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య

హుజూరాబాద్ రూరల్, ఆగస్టు 23: కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులైన సరిత, విజయరెడ్డిలపై కొంత మంది దుండగులు దాడి చేయడం హేయమైన చర్య అని హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ కన్వీనర్ గడ్డం ధర్మారెడ్డి, కో-కన్వీనర్లు కాయిత రాములు, నిమ్మటూరి సాయికృష్ణలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసులు కఠినంగా వ్యవహరించాలని కోరారు.

ప్రజలకు అండగా ఉంటాం

హుజూరాబాద్ రూరల్, ఆగస్టు 23: కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాలకు శుక్రవారం సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.

ఆలయ నిర్మాణంపై డీపీవో విచారణ



గోపాల్‌రావుపేటలో విచారణ చేపడుతున్న డీపీవో రవీందర్

రామడుగు, ఆగస్టు 23: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామపంచాయతీ కార్యాల యంలో హనుమాన్ దేవాలయ పునర్నిర్మాణంపై శుక్రవారం డీపీవో రవీందర్ విచారణ చేపట్టారు. మాజీ సర్పంచ్ కర్ర సత్యప్రసన్న అక్కడ నిర్మాణం చేపట్టొద్దని జిల్లా కలెక్టర్, డీపీవోలకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీస్ బందోబస్తు మధ్య విచారణ కార్యక్రమం కొనసాగింది. డీపీవో హనుమాన్ ఆలయ నిర్మాణం చేపట్టే స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి గ్రామస్థుల నుంచి వివరాలను సేకరించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి, నల్ల పోచమ్మ, పోచమ్మ ఆలయాలను పరిశీలించారు. కాగా ఫిర్యాదు చేసిన వ్యక్తి విచారణ సమయంలో లేదు. విచారణ పూర్తయిన త ర్వాత అక్కడికి చేరుకోవడం గమనార్హం. గ్రామస్థుల నుంచి సేకరించిన విషయాలు అక్కడ నెలకొన్న పరిస్థితులను కలెక్టర్‌కు నివేదిస్తానని డీపీవో తెలిపారు.

ప్రతి మహిళకు ఆరోగ్య పరీక్ష తప్పనిసరి

సుభాష్‌నగర్, ఆగస్టు 23: ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా ప్రతి మహిళకు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. శుక్రవారం ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐసీడీఎస్, ఆరోగ్యశాఖ సమన్వయంతో 13 సంవత్సరాలు నిండిన బాలికలు, మహిళల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతి మహిళ ఆరోగ్యవంతురాలు కావాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ సిబ్బంది పరస్పర సహకారంతో ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వారీగా గ్రామ స్థాయిలో 13 సంవత్సరాలు నిండిన బాలికలు, మహిళల జాబితాను సిద్ధం చేయాలన్నారు. వారందరికీ మూడు నెలలకు ఒకసారి పూర్తి ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారి ఆరోగ్యంలో ఏమైనా సమస్యలు ఉంటే వాటిని గుర్తించి వారికి సూచించాలన్నారు. మహిళలు తీసుకోవాల్సిన ఆహారం, పరిశుభ్రత, వ్యాయామం వంటి వాటి గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎంతో ఖర్చుతో కూడిన వైద్యపరీక్షల నిర్వహణను ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వినియోగించుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, ట్రెయినీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి

'అగ్రదేశాల సరసన భారత్'

కరీంనగర్ టౌన్, ఆగస్టు 23: గత సంవత్సరం ఇస్రో చేపట్టిన చంద్రయాన్ ప్రయోగం విజయవంతం కావడంతో భారతదేశం అగ్రదేశాల సరసన నిలిచిందని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు కెప్టెన్, డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల సప్తగిరికాలనీలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు కార్యక్రమాలు నిర్వహించారు. డ్రాయింగ్, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజేందర్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు గాజుల రవీందర్, ఉమా మల్లేశ్వరి, ఎం.అన్నపూర్ణ, సిహెచ్.శ్రీనివాస్, సత్యనారాయణరావు, రామారావు, అపోలినవెన్లీ, పద్మజ, ఎ.శంకరయ్య, బి.భారతి, జి.ప్రసాద్‌రావు, ఎ.ప్రమీల, జి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యం కోసం కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 23: నగరంలో ఎక్కడ కమ్యూనిటీ హాల్‌కు సంబంధించి కార్పొరేటర్ల నుంచి వినతిపత్రం వచ్చినా వాటిని సాధ్యమైనంత వరకు నిర్మాణం చేస్తున్నామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక 14,35 డివిజన్లలో కార్పొరేటర్లు దిండిగాల మహేశ్, చాడగొండ బుచ్చిరెడ్డితో కలిసి రూ.26.50 లక్షల రూపాయలతో సప్తగిరికాలనీ శ్రీకోదండ రామాలయంలో చేపట్టనున్న కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ ఐదు నెలల్లో హాల్ పనులు పూర్తవుతాయని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వాల రమణారావు, దేవాలయ కమిటీ అధ్యక్షుడు గౌతంరావు, మాజీ కార్పొరేటర్ టి.రమేశ్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, సభ్యులు, డివిజన్ పెద్దలు పాల్గొన్నారు.

నేడు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్,ఆగస్టు 23: నగరంలో విద్యుత్ కొత్త లైన్ల పనుల్లో భాగంగా శనివా రం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వివిధ ప్రాంతా లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ 1, ఏడీఈ, సాయినేని నరేందర్ తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు భారత్ టాకీస్ ఏరియా, ఓం సాయి నిర్మాణ కాంప్లెక్స్ ఏరియా వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఐవీవై పాఠశాలలో ఘనంగా అంతరిక్ష దినోత్సవం

భగత్‌నగర్, ఆగస్టు 23: సీతారాంపూర్‌లోని ఐవీవై పాఠశాలలో అంతరిక్ష దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐవీవై పాఠశాల చైర్మన్ పసుల మహేష్ మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయానికి గుర్తుగా భారతదేశం ప్రతి సంవత్సరం ఆగస్టు23వ తేదీన జాతీయ అంతరిక్ష దినోత్సవం జరుపుకోవాలని ప్రధాని మోదీ ప్రకటించారన్నారు. అంతరిక్షంలో చందమామ వింతలు, విశేషాల గురించి తెలుసుకోవడానికి ఇస్రో చైర్మన్, తన శాస్త్రవేత్తల కృషి ఫలితంగానే మన చంద్రయాన్-3 అన్నారు. 40 రోజుల కఠినమైన అంతరిక్ష ప్రయాణం చంద్రయాన్ ఛాలెంజింగ్ ల్యాండర్ మిషన్ చంద్రుని ఉపరితలంపై విజయవంతంగా దిగిందన్నారు. ఆగస్టు 23వ తేదీన చంద్రుడిపై భారత దేశ జెండాను ఎగురవేసిందన్నారు. అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో విజేతలు అర్షిన్ రిషి, సాధ్వి, చందన, వేదితలను అభినందించారు. ఈ సందర్భంగా చంద్రయాన్-3కి సంబంధించిన ప్లకార్డులను విద్యార్థులు ప్రదర్శించారు. జై భారత్, జయహో భారత్ నినాదాలతో హోరెత్తించారు.



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ పసుల మహేష్

పంటలను ధ్వంసం చేస్తున్న పందులు



వరిపొలంలో పందులు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 23: కరీంనగర్ మండలం నగునూర్ గ్రామ రైతులు పందుల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో వేసిన నారుమడులను పాడు చేయగా ప్రస్తుతం నాటు వేసిన పొలాలను సైతం పందులు వదలడం లేదు. దీంతో రైతులు పొలాల వద్ద కాపలా ఉండే పరిస్థితి నెలకొంది. పంట పొలాల్లోకి వెళ్లి పంటను నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు పందుల పెంపకందారుల వద్దకు వెళ్లి వాటిని గ్రామంలోకి, పొలాల్లోకి రానివ్వకుండా చూడాలని చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు పేర్కొంటున్నారు.

కాయ్ జాతీయ పోటీల్లో సీఎస్‌కేఐ క్రీడాకారులకు పతకాలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 23: కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా(కాయ్) ఆధ్వర్యంలో హర్యానాలోని చండీఘర్‌లో ఈ నెల 16,17,18 తేదీల్లో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన కాంటినెంటల్ షొటోకాన్ కరాటే ఆఫ్ ఇండియా (సీఎస్‌కెఐ)అకాడమిక్ క్రీడాకారులు విశేష ప్రతిభచాటి మూడు పతకాలను సాధించారు. ఈ పోటీల్లో క్రీడాకారులు బాలికల విభాగంలో 16,17సంవత్సరాల 48కిలోల కేటగిరీలో పావని బంగారు పతకాన్ని, 30 కిలోల పైబడిన విభాగంలో జి అనన్య రజిత పతకాన్ని, బాలుర 8,9సంవత్సరాల వయస్సు విభాగం 20కిలోల కేటగిరీలో ఎ.అవియాన్ కాంస్య పతకాన్ని సాధించారని కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కాయ్ అధ్యక్షుడు ఇ.శ్రీనివాస్ తెలిపారు. అలాగే రాష్ట్రం నుంచి 48మంది క్రీడాకారులు పాల్గొని 3బంగారు ఒక రజత, 9కాంస్య పతకాలు మొత్తం 13 పతకాలు సాధించి దేశంలో పదవ స్థానంలో నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను సీఎస్‌కెఐ చైర్మన్ చల్ల హరిశంకర్, ప్రధాన కార్యదర్శి మాడుగుల ప్రవీణ్, కోశాధికారి వంగల శ్రీధర్, ఉపాధ్యక్షుడు పెద్ది సందీప్ అభినందించారు.



పతకాలు సాధించిన సీఎస్‌కెఐ క్రీడాకారులు

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

- ప్రతి నెలా సరుకులు తీసుకెళ్లాలి
- డీఆర్‌డీవో పీడీ శ్రీధర్



మాట్లాడుతున్న డీఆర్‌డీవో పీడీ శ్రీధర్

మానకొండూర్, ఆగస్టు 23: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని డీఆర్‌డీవో పీడీ శ్రీధర్ సూచించారు. మానకొండూర్‌లోని మూడో అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లల బరువు క్రమం తప్పకుండా చూడాలని చెప్పారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహార సరుకులను ప్రతి నెలా అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరలక్ష్మీ, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

రామడుగు: మహిళలు సమయానుగుణంగా పోషకాహారాన్ని తీసుకుంటే ఆరోగ్యవంతులుగా ఉంటారని మండల ప్రత్యేకాధికారి అనిల్ ప్రకాష్ కిరణ్ అన్నారు. స్థానికంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు తప్పనిసరిగా బలమైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ రమేశ్ చిన్నారుల తల్లులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఆయుష్ డాక్టర్ రజిత, ఎంపీడీవో రాజేశ్వరి, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశాలు సునీత, నవీన, పద్మ హెచ్‌వి వసంత, అంగన్‌వాడీ టీచర్స్ అంజని, వసుమతి, లలిత పాల్గొన్నారు.

ఇల్లందకుంట: చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికరమైన ఆహారం అందిస్తున్నా మని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో పుల్లయ్యతో కలిసి స్పెషలాఫీసర్ శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సెంటర్‌లోని విద్యార్థులు హాజరు పట్టిక, పిల్లల ఎదుగుదల, పిల్లల తల్లులకు అందిస్తున్న ఆహారం గురించి సెంటర్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ నిర్వాహకులు పాల్గొన్నారు.

'అనుచిత వ్యాఖ్యలను సహించబోం'

తిమ్మాపూర్, ఆగస్టు23: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణరెడ్డి అన్నారు. మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోరపల్లి రమణరెడ్డి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో నందగిరి రవీంద్ర చారి, బస్వయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

శంకరపట్నం, ఆగస్టు 23: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు అన్నారు. కొత్తగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. .

బీసీ హక్కుల కోసం పోరాడాలి

హుజూరాబాద్ లీగల్, ఆగస్టు 23: బీసీ హక్కుల సాధన కోసం బీసీ న్యాయవాదులు పోరాడాలని ఐఎల్‌పీఏ రాష్ట్ర నాయకులు సాయిని నరేందర్ అన్నారు. ఈ నెల 25న హైద్రాబాద్‌లో నిర్వహి స్తున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి బీసీ న్యాయవాదుల సదస్సును పెద్దఎత్తున హాజరై జయ ప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

వాస్తుశాస్త్రంలో కొత్తపల్లి వాసికి డాక్టరేట్

తిమ్మాపూర్, ఆగస్టు23: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన నోముల సుధీర్‌గౌడ్ రాజస్థాన్‌లోని శ్రీ మహర్షి కళాశాల నుంచి వాస్తు శాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టాతో పాటు గోల్డ్‌మెడల్‌ని సాధించారు. సుధీర్‌గౌడ్ 2021లో పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో జ్యోతిర్ వాస్తు శాస్త్రంలో పీజీ పూర్తి చేశారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

తిమ్మాపూర్, ఆగస్టు 23: మత్తు పదార్థాల మహమ్మారిని అంతమొందించాలనే లక్ష్యంతో కమిషనరేట్ పోలీసులు అనుమానిత ప్రాంతాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహిస్తున్నారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అలుగునూర్‌తో పాటు మండలంలోని ఎల్ఎండీ కాలనీ పరిధిలోని బస్‌స్టాండ్, పాన్ షాప్‌లు, కిరాణా దుకాణాల సముదాయల్లో శుక్రవారం తిమ్మాపూర్ సర్కిల్ సీఐ కె స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై చేరాలు, బ్లూ కోల్ట్స్ సిబ్బంది సురేష్, మల్లికార్జున్, సిబ్బంది అహ్మద్, నల్లాపుద్దీన్ పాల్గొన్నారు.

చెత్తాచెదారం డ్రైనేజీల్లో వేయొద్దు

హుజూరాబాద్, ఆగస్టు 23: చెత్తాచెదారం డ్రైనేజీల్లో వేయొద్దని కౌన్సిలర్ ఉమాదేవి అన్నారు. పట్టణంలోని 21వ వార్డులో శుక్రవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ హెల్త్ ఆఫీసర్ జరీనా, సానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో రోడ్లకు మరమ్మతులు

- కార్యదర్శికి గ్రామస్థుల అభినందన

చిగురుమామిడి, ఆగస్టు 23: మండలంలోని రేకొండ పంచాయతీ కార్యదర్శి జి అజయ్. సొంత ఖర్చులతో బురదరోడ్లకు మరమ్మతులు చేయించారు. దీంతో ఆయనను గ్రామస్థులు శుక్రవారం అభినందించారు. రేకొండ పంచాయతీ పరిధిలోని బండారుపల్లికి వెళ్లే రోడ్డు పూర్తిగా బురదమయంగా మారి రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రజల ఇబ్బంది లను తొలగించాలనే తపనతో పంచాయతీ కార్యదర్శి జి అజయ్. ప్రభుత్వ నిధులు లేకున్నా సుమారు మూడు లక్షల రూపాయలకుపైగా వెచ్చించి మరమ్మతులు చేయించారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లే దారిలో ఉన్న ఒర్రె పూర్తిగా ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. దీంతో ఒర్రెను 400 బస్తాల ఇసుక నింపి మరమ్మతు చేయించారు. పోచమ్మవాడలో రోడ్డు గుంతలు పడి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మట్టి పోయించి గుంతలు పూడ్చివేయించారు. ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కారానికి పైపు లైన్ వేయించారు.



బండారుపల్లికి వెళ్లే రోడ్డుపై మట్టి పోయించిన కార్యదర్శి అజయ్

ఆలయాల్లో శ్రావణ పూజలు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 23: నగరంలోని ఆలయాల్లో శ్రావణమాస మూడవ శుక్రవారం పూజలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు ఒడిబియ్యం, పసుపుకుంకుమలు, గాజులు, వస్త్రాలు సమర్పించారు. ఇళ్లల్లో, ఆలయాల్లో వాయినాలు పంచుకున్నారు.

ఫకీర్‌పేటలో శుక్రవారం సభ

కరీంనగర్ రూరల్, ఆగస్టు23: కరీంనగర్ మండలం ఫకీర్‌పేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభను నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ పథకాలను వివరించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు, గర్భిణీలు, బాలింతలకు ఆరోగ్యం పట్ల పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ నిర్మల, కార్యదర్శి బి దేవిక, ప్రధానోపాధ్యాయురాలు విజయశ్రీ, ఆశా కార్యకర్త రాజమణి, విఓ అధ్యక్షురాలు రాధ పాల్గొన్నారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

గణేశ్‌నగర్, ఆగస్టు 23: జూనియర్ డాక్టర్ హత్యాచార నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ మాట్లాడుతూ బెంగాల్‌లో సామూహిక హత్యాచారానికి గురైన జూనియర్ డాక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిర్భయ లాంటి అనేక చట్టాలు వచ్చినా అవి నిరుపయోగంగా ఉన్నాయని అన్నారు. ఈ దేశంలో అనేక రంగాలలో మహిళలు ముందుకు దూసుకుపోతున్నా అకృత్యాలకు బలవుతున్నారన్నారు. కార్యక్రమంలో ఉప్పునీటి మానస, కీర్తి, చందన తదితరులు పాల్గొన్నారు.

పారమిత హెరిటేజ్ పాఠశాలలో ఫైర్‌సేఫ్టీపై అవగాహన

భగత్‌నగర్, ఆగస్టు 23: పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో ఫైర్‌సేఫ్టీపై శుక్రవారం అవగాహన కల్పించారు. కరీంనగర్ జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇన్‌ఛార్జి ఫైర్ ఆఫీసర్ ఎం గుండయ్య, కరీంనగర్ ఫైర్‌స్టేషన్ సిబ్బంది టి లక్ష్మారెడ్డి (డిఓపి) జి అనిల్‌కుమార్, సిహెచ్ కిషోర్, కెప్రసాద్, సిహెచ్ శ్రీనివాస్, వి గంగేష్ ఆధ్వర్యంలో ఫైర్‌సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బందిని పాఠశాల చైర్మన్ డాక్టర్ ఇ ప్రసాదరావు అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు అనూకర్‌రావు, వియుఎం ప్రసాద్, రమణ, వినోద్‌రావు, హన్మంతరావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, కో-ఆర్డినేటర్లు, పీఈటీలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వివేకానంద విద్యార్థికి పతకాలు

కరీంగన్ స్పోర్ట్స్, ఆగస్టు 23: మెదక్ జిల్లాలో ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్-23 అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థి ఎం వినయ్ విశేష ప్రతిభ చాటి రెండు పతకాలు సాధించాడు. మూడు వేల మీటర్ల పరుగులో బంగారు పతకం, 1,500 మీటర్ల పరుగులో కాంస్య పతకాన్ని సాధించాడని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. పతకాలు సాధించిన వినయ్‌ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో బి శ్రవణ్ కుమార్, ఎసీవో బి సంపత్‌కుమార్, రామేశ్వర్‌రావు, అధ్యాపక బృందం పాల్గొని అభినందించారు.

కొనసాగుతున్న రైతు ఫిర్యాదులు

కరీంనగర్ రూరల్, ఆగష్టు23: పలు కారణాల వల్ల రైతులకు రుణమాఫీ కాకపోవడంతో కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని రైతు వేదికలో ఫిర్యాదుల కౌంటర్ ఏర్పాటు చేశారు. అలాగే కరీంనగర్ మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. శుక్రవారం 65 ఫిర్యాదులను వ్యవసాయశాఖ అధికారులు స్వీకరించారు. ఈ నెల 20వ తేదీ నుంచి మొత్తం 687 ఫిర్యాదులు రైతు రుణమాఫీ కాని రైతులు అందజేశారని మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సత్యం తెలిపారు. 30వ తేదీ వరకు ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

● సంక్షిప్త సమాచారం..

●హుజూరాబాద్: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం వివిధ పార్టీలకు చెందిన నాయకులతో ఆర్డీవో రమేశ్‌బాబు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్ల జాబితా విషయంపై అవగాహన కల్పించారు.

● శంకరపట్నం: వాహనదారులు వాహనానికి సంబంధించి సరైన పత్రాలను కలిగి ఉండాలని కేశవపట్నం ఎస్ఐ కొత్తపల్లి రవి అన్నారు. శుక్రవారం సైదాపూర్ క్రాస్ రోడ్ వద్ద సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేశారు.

●సైదాపూర్: ఘనపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్, శ్వేత, రాజు అనే లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తిప్పారపు భువనచంద్ర, గ్రామ శాఖ అధ్యక్షుడు కొరిమి రాజు పాల్గొన్నారు.

● వీణవంక: పోతిరెడ్డిపల్లి గ్రామంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో డిపార్ట్మెంట్ ఆఫ్ ఆయుష్ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులతో వృద్ధులకు శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. కార్యక్రమంలో డాక్టర్ సంధ్యరాణి, జిల్లా ప్రోగ్రాం అధికారి ప్రవీణ్ కూమార్, ఎస్ఎస్‌వో స్వామి, ఏఎన్ఎం రాజేశ్వరి ఉన్నారు.

- మాల్లారెడ్డిపల్లి గ్రామనికి చెందిన వాలీబాల్ క్రీడాకారుడు కర్రె నాని యాదవ్‌ని జిల్లా సినీయర్ వాలీబాల్ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీగా ఎన్నుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షు డు పి రామకృష్ణ, పడాల అజయ్, కన్నా రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

● జమ్మికుంట: జమ్మికుంట పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేసి పదవీ విరమణ పొందుతున్న లక్ష్మారెడ్డి సేవలు అభినందనీయమని ఇన్‌స్పెక్టర్ వరగంటి రవి అన్నారు. ఈ నెల 31వ తేదీన పదవీ విరమణ పొందుతున్న లక్ష్మారెడ్డికి శుక్రవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు.

● మానకొండూర్: బీసీ సంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మండలంలోని వేగురుపల్లి గ్రామానికి చెందిన బండారి మల్లయ్యను నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షులు భైరి రవికృష్ణగౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు.

- మండలంలోని ఊటూర్ గ్రామంలో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు.

●రామడుగు: గోపాల్‌రావుపేట గ్రామ బేడ బుడగజంగం సంఘం అధ్యక్షుడిగా టేకు రాజేశం విజయం సాధించారు. రాజేశంకు 122 ఓట్లు, ప్రత్యర్థి నిశాంత్‌కు 45 ఓట్లు పడ్డాయి. ఎన్నికల అధికారిగా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న వ్యవహరించారు.

●గన్నేరువరం: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో వివిధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం బంద్ నిర్వహించారు.శాంతి ర్యాలీ నిర్వహించారు.

● తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల నీటి పారుదల శాఖ సర్కిల్ సీపీఎస్ ఉద్యోగులు భోజన విరామం సమయంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో డీఎస్ఈ వెంకటయ్య, ఈఈ స్వామి ఉన్నారు.

● శంకరపట్నం: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి నాగార్జున అన్నారు. మండలంలోని మొలంగూర్, చింతగుట్ట గ్రామాల్లో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఎంపీవో ప్రభాకర్, మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.